క్లుప్తంగా

భూ తగాదాలో నలుగురిపై కేసు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని సంపతి కోట పంచాయతీ ముంతపోగులవారిపల్లిలో భూమి పంపకాల విషయంలో ఘర్షణ పడటంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భూ తగాదా కారణంగా అమడగూరు రాజన్న అనే వ్యక్తిపై దాడి చేసి గాయపరచిన గుడిపల్లి లక్ష్మీదేవి (35), గుడిపల్లి వెంకట్రమణ (40), బాలు (25) ధనమ్మలపై కేసు నమోదు చేసామని ఎస్ఐ వెల్లడించారు.

జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం సమీపంలో ఓ చింత చెట్టు వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రబాబు శనివారం పేర్కొన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద లభించిన పేకముక్కలు రూ.5,250 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

పెద్దమండ్యం : మండలంలో ఆరుగురు జూదరులను శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రామాంజనేయుడు తెలిపారు. సీ గొల్లపల్లె సమీపంలో జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. జూదరుల నుంచి రూ. 4750 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గృహ నిర్మాణ సంస్థ అధ్యక్షుడిగా గంగిరెడ్డి

ములకలచెరువు : ములకలచెరువు మండల శ్రీ సత్యసాయి సహకార గృహ నిర్మాణ సంస్థ అధ్యక్షుడిగా గంగిరెడ్డి ఏకాగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక మండల కేంద్రం సింగల్ విండో కార్యాలయంలో ఎన్నికల అధికారి ఖాసీం సాహెబ్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. సంఘం ఉపాధ్యక్షుడిగా రెడ్డి మౌలాలి, సభ్యులుగా నరసింహులు, నాగభూషణ, బావాజాన్‌లను ఎన్నుకున్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

పీలేరు : కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయుటకు రాష్ట్ర మంత్రి మండలిలో ఆమోదం తెలిపినందుకు సీఎం చిత్రపటానికి శనివారం వైఎస్సార్‌టీయూసీ కార్యాలయంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు చిన్న యల్లప్ప మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ సమస్యను ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో పరిష్కరించారన్నారు. రెగ్యులర్ అయిన ఉద్యోగులు సీఎంకు రుణపడి ఉంటారన్నారు. చిన్నమ్మ, ఎస్.వి. రమణ, పార్వతి, రాజమ్మ, సర్తాజ్, చంద్రకళ, ఆయిషా, శివ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగాల్లో రాణించాలి

– జెఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన

మదనపల్లె సిటీ : విద్యార్థులు సాంకేతిక రంగాల్లో రాణించాలని జెఎన్‌టీయూ వీసీ రంగజనార్ధన తెలిపారు. శనివారం స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ విభాగం, జెఎన్‌టీయూ అనంతపురం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌సెల్ సంయుక్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ డేటా సైన్సుపై సెమినార్ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ డేటా సైన్సులో పరిణామాల గురించి వివరించారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'


మదనపల్లె : మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్

మదనపల్లె : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 23 నుంచి నెల రోజులపాటు జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. అందులో భాగంగా మండల స్థాయి అధికారుల బృందంతో పాటు క్షేత్రస్థాయి సచివాలయ సిబ్బంది నెల రోజుల పాటు తమ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి, ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. తహసీల్దార్ బావాజాన్,ఈఓపీఆర్‌డి వెంకటసుబ్బయ్య, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చందన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కలికిరి : ప్రభుత్వం ఈ నెల 23 నుంచి ప్రారంభించనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య మాట్లాడుతూ ఈ నెల 23 నుంచి వచ్చే నెల 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని, ఇందులో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారికి అవసరమైన పత్రాలు, ధృవీకరణ పత్రాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలలో సమస్యలు తదితరాలపై పరిష్కార చర్యలుంటాయన్నారు. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు వలంటీర్లుకు అవగాహన కల్పించాలని సూచించారు.

వాల్మీకిపురంలో..

వాల్మీకిపురం : ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు అందరికీ నూరు శాతం అందించేలా అధికారులు అన్ని స్థాయిల్లోనూ అంకిత భావంతో పని చేసి జయప్రదం చేయాలని ఎంపీపడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్న సురక్షా కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 1వ తేదీ నుంచి ఎంపీడీఓ, తహసీల్దార్ బృందాలుగా ఏర్పడి నిర్ణయించిన తేదీల్లో గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ముందుగానే తెలిపి వారికి రావాల్సిన పథకాలకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఫిరోజ్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలు పరిష్కారం

గుర్రంకొండ : జగనన్న సురక్ష పథకంతో ప్రజల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావ్, ఏఓ నాగశివారెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ఈనెల 23 నుంచి వచ్చేనెల 23 వరకు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. ఇందు కోసం మండల స్థాయిలో తహసీల్దార్, ఈవోపీఆర్‌డీ ఒక బృందంగా, ఎంపీడీవో, ఉప తహసీల్దార్‌లు ఒక బృందంగా ఏర్పాటు చేస్తారన్నారు. గ్రామాల్లోని ప్రతి వలంటీర్ తన పరిధిలో ఉన్న కుటుంబాల్లో నెలకొన్న సమస్యలు, అర్హత ఉండి ఏవైనా ప్రభుత్వ పథకాలు రాకున్నవారు, వివిధ రకాల సర్టిఫికెట్లు కావాల్సిన వారి వివరాలు సేకరించాల్సి ఉంటుందన్నారు. మండల స్థాయిలో ఏర్పడిన అధికారుల బృందాలు వాటిని సకాలంలో పరిష్కరించి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకొంటారన్నారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.

బి.కొత్తకోట : వచ్చే నెల ఒకటి నుంచి నగర పంచాయతీలో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం అమలు కోసం వలంటీర్లు నిర్వహించే సర్వే పక్కాగా ఉండాలని నగర పంచాయతీ మేనేజర్ బి.రమాదేవి అన్నారు. శనివారం కార్యాలయంలో ఐదు వార్డు సచివాలయాల ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై ఒకటిన తాకాటంవారిపల్లె, మూడున పాశంవీధి, ఆరున కాలనీ, 8న సింహంవీధి, 10న నందిశెట్టివీధి సచివాయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాల నిర్వహణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి కమిషనర్, తహసీల్దార్, ఉద్యోగులు పాల్గొని ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అదేరోజు మంజూరు చేయడం జరుగుతుందని చెప్పారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : రాష్ట్రంలో పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం. ఆయన చేసిన మేలు మరచిపోకుండా రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని కలికిరి మండలం చీకటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చీకటిపల్లి కస్బా, రంగనాధపురం, వినాయక నగర్ కాలనీ ప్రాంతాల్లో ఎమ్మెల్యే శనివారం ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా గత నాలుగు సంవత్సరాల పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలతో నేరుగా చేకూర్చిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ గత ప్రభుత్వాలు చేయని విధంగా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. 11కెవి విద్యుత్ లైన్ షిఫ్టింగ్, రెవెన్యూ సమస్యలు, మురుగునీటి కాలువలు, సిమెంటు రోడ్లు, తాగునీటి పైపులైన్‌లు, జగనన్న కాలని ఇండ్లు, సామాజిక ఫించన్లు, సంక్షేమ పథకాలు వర్తింపు తదితర సమస్యలపై ప్రజల నుంచి వినతులు అందాయి. స్పందించిన ఎమ్మెల్యే ఆయా శాఖల అధికారులను సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

రీ సర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం

భూ రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చీకటిపల్లిలో భూ రీసర్వే పూర్తి కావడంతో రైతులకు మంజూరైన శాశ్వత భూ హక్కు పట్టాదారు పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, సర్పంచ్‌లు డా. టి.సురేంద్రనాథరెడ్డి, వెంకటరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్ రెడ్డి, శివాజీ, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా


సంక్షమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

నిమ్మనపల్లె : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగు ఏళ్లుగా రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటిలోనూ సంక్షేమ వెలుగులు నిండాయని, ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే ఎం.నవాజ్ బాషా అన్నారు. శనివారం మండలంలోని ముష్టూరు పంచాయతీలోని ఎర్రప్పగారిపల్లె, గౌనివారిపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చెంగ్రాయుడు, ఎంపీపీ నరసింహులు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డిలతో కలసి ఎమ్మెల్యే గ్రామంలో పర్యటించారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించే బుక్‌లెట్‌ను అందించి, సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, సిమెంట్ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం, పింఛన్లు రేషన్‌కార్డుల మంజూరు, ఆరోగ్యశ్రీ కార్డులో మార్పులు తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అధికారులు గడువు లోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజలకు మంచి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు మరోసారి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, సర్పంచులు సుబ్రమణ్యం, ఉప సర్పంచు మహమ్మద్‌రఫీ, నాయకులు రమణారెడ్డి, నరేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రాజగోపాల్, రమణ, తహసీల్దార్ మంజుల, ఎంపిడిఓ శేషగిరిరావు, ఎస్.ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మదనపల్లె : ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని ప్రాంతీయ పశు వైద్య కేంద్రంలో పశుసంవర్ధకశాఖ డీడీ కోటేశ్వరరావు, ఏడీలు విశ్వేశ్వరరెడ్డి, రోహిణిలతో కలిసి పాడి రైతులకు రాయితీ గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందు వేశారు. వైఎస్సార్ పశు బీమా పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాడి రైతులందరూ వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఆర్‌బీకె చైర్మన్లు కత్తి రాజా, నాగరాజ, పశు వైద్యులు దివ్యప్రసాద్‌రెడత్తి, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ నరసింహారెడ్డి, సిబ్బంది సుమలత, వీరాంజనేయులు, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేయాలి


మాట్లాడుతున్న పీడీ సత్యనారాయణ

తంబళ్లపల్లె: మహిళా సాధికారతే లక్ష్యంగా సంఘాలను బలోపేతం చేసి ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ఇందిరక్రాంతిపథం ఉద్యోగులు పనిచేయాలని పీడీ సత్యనారాయణ కోరారు. శనివారం స్త్రీశక్తిభవన్‌లో తంబళ్లపల్లె, పెద్దమండ్యం, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండల ఇందిరక్రాంతి పథం ఉద్యోగులతో సమీక్ష సమావేశం జరిగింది. మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందించి తిరిగి చెల్లించే విధంగా సంబంధిత సీసీలు, సంఘమిత్రలు చొరవ చూపాలన్నారు. మహిళా సభ్యులను చైతన్యపరిచి రుణాలను సద్వినియోగం చేసుకుని సక్రమంగా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎఫ్‌పీవో ఏపీయం గంగార్జున, ఏపీయంలు, సీసీలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసం అసత్య ఆరోపణలు

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో ఆయిల్ సీడ్స్ స్థలంలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని టీడీపీ నాయకుడు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు జయరామచంద్రయ్య అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గూరేవుపల్లె పంచాయతీలో సర్వే నెంబరు 175, 176, 177, 198/ఏ లలో 17.40 ఎకరాల్లో 723 మందికి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపడుతుంటే ఇది చూసి ఓర్వలేని కిషోర్‌కుమార్ రెడ్డి తన రాజకీయ లబ్ధికోసం అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కోర్టు సుబ్బారెడ్డి, నాగభూషణం, ఆంజినేయులు, సిద్దయ్య పాల్గొన్నారు.

సమష్టి కృషితో అభివృద్ధి చేద్దాం

పీలేరు రూరల్ : సమష్టి కృషితో పీలేరు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేద్దామని సర్పచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ ఆదాయ, వ్యయాలు చదివి వినిపించి ఆమోదించారు. గ్రామ పంచాయతీ పరిధిలో 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులకు ఆమోదించినట్లు తెలిపారు. పంచాయతీకి అవసరమైన డంపింగ్ యార్డు ఏర్పాటుకు గూడరేవుపల్లె, ముడుపులవేముల పంచాయతీలలో స్థలం ఎంపిక చేసినట్లు చెప్పారు. పంచాయతీ పరిధిలో మానేరు కమిటీని రద్దుకు ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు శ్రీనాథరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, అబీద్, హబీబ్‌బాషా, సచిన్, లావణ్య, కళావతి, నాగభూషణం, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె : స్థానిక కన్నెమడుగు సింగిల్‌విండో బ్యాంకు ద్వారా పంపిణీ చేసిన రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్ రెడ్డి తెలిపారు. శనివారం నూతనంగా ఏర్పాటైన సింగిల్‌విండో బ్యాంకులో శనివారం బంగారు తాకట్టుపై రుణాలు పంపిణీ చేశారు. బంగారుపై 7శాతం (58పైసలు) వడ్డీతో బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు ఆప్‌కాబ్ మేనేజర్ ప్రవీన్ తెలిపారు. రుణాలు పొందిన ఖాతాదారులు తిరిగి సకాలంలో చెల్లించి బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఈఈవో భాస్కర్‌రెడ్డి , మండల కోఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, నాయకులు నరేంద్రరెడ్డి, రామూర్తి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో జాతీయ ఆరోగ్య సర్వే

ములకలచెరువు : మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీలో శనివారం కుటుంబ ఆరోగ్యంపై జాతీయ స్థాయి సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్‌లు లోకేష్, అహ్మద్ సర్వే నిర్వహించారు. సిగ్మారీసెర్చ్ కన్సల్‌టెంసీ ఏజన్సీ సభ్యులు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి మాతా శిశు సంరక్షణ పోషణ, వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన వివరాలతో పాటు నీరు, పారిశుద్యం అంశాలపై సర్వే చేశారు. జిల్లా ఆరోగ్య శాఖ ఆదర్వంలో జాతీయ కుటుంబ సర్వే 6వ విడత నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్వే నివేదికను ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సంస్థకు అందజేస్తామని వైద్యులు చెప్పారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్టలో శనివారం ధ్వజారోహణం కార్యక్రమంతో పంచమవేద మహాభారత యజ్ఞం కార్యక్రమాన్ని ప్రారంభించారు. శనివారం మహాభారత యజ్ఞం వద్ద ద్రౌపది సమేత ధర్మరాజులకు, శ్రీ కృష్ణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఆదివారం నుంచి ప్రతి రోజూ మధ్యాహ్నం హరికథా కాలక్షేపం, రాత్రి నాటకములు ఉంటాయని తెలిపారు. జూలై 2వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

బి.కొత్తకోట : టీటీడీ శ్రీ వాణీ ట్రస్టు ద్వారా మంజూరైన రూ.10 లక్షలతో బి.కొత్తకోట మండలం బయ్యప్పగారిపలె పంచాయతీ యర్రగుంట్లలో సమరసత సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్ర, శనివారాల్లో వేదమంత్రాలతో వైభవంగా జరిగింది.

పండుగలా జగనన్న విద్యాకానుక పంపిణీ


రామసముద్రం : విద్యాకానుక పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా


పెద్దమండ్యం: ప్రోత్సాహక నగదును అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ


పెద్దతిప్పసముద్రం : మాట్లాడుతున్న ఎంఈఓ నారాయణ

రామసముద్రం : రాష్ట్రంలో విద్యాకానుక పంపిణీ పండుగలా నిర్వహించడం జరుగుతోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా తెలిపారు. శనివారం మండలంలోని మినికి గ్రామంలో గోకుల్ కళ్యాణ మండపంలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ విద్య విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు విద్యాకానుక అందించి ఎలాంటి లోటులేకుండా వారికి గొప్ప ఆస్తిని అందజేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా జగనన్న ఆణి ముత్యాలు అనే కార్యక్రమంలో ఉత్తమ విద్యార్థులకు మొదటి బహుమతి రూ.3 వేలు, రెండవ బహుమతి రూ.2 వేలు, మూడవ బహుమతి రూ.1000 ప్రతి పాఠశాలకు అందించడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి సుందరం, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు రమణారెడ్డి , గంగాధర్‌నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవ రెడ్డి, కన్వీనర్ భాస్కర్‌గౌడు, తహసీల్దార్ దైవరాజన్, ఎంఈవో హేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆణిముత్యంలా తయారవ్వాలి

మదనపల్లె సిటీ : జగనన్న ప్రభుత్వంలో ప్రతి విద్యార్థి ఓ ఆణిముత్యంలా తయారవ్వాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో పదో తరగతిలో స్కూల్‌స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాపర్లకు జగనన్న ఆణిముత్యాల్లో భాగంగా వరుసగా రూ.3,000, రూ2000, రూ.1000 నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లి ఉన్నత చదువుల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహమ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

పెద్దమండ్యం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నట్లు ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక అన్నారు. స్థానిక మోడల్ పాఠశాలలో జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం ప్రోత్సాహక నగదు, ప్రశంసాపత్రం, మెడల్స్‌ను ఎంపీపీ, జెడ్పీటీసీలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని తీసుకొచ్చి విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పీరమ్మ, ప్రిన్సిపల్ రామాంజులునాయక్, వైస్ ప్రిన్సిపల్ అనీల్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్కార్ స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు

పెద్దతిప్పసముద్రం : సర్కార్ స్కూళ్లను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలని ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శనివారం ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేసారు. ఎంఈఓ నారాయణ, ప్రిన్సిపాల్ శివకుమారితో పాటు ప్రజా ప్రతినిధులు సుబ్బిరెడ్డి, కార్యం చంద్ర, ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో ఎదగాలి

బి.కొత్తకోట : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, సహకారంతో ప్రతి విదార్థి విద్యలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎంవో ఆర్.రెడ్డిశేఖర్ అన్నారు. శనివారం బి.కొత్తకోట జెడ్పీ హైస్కూల్‌లో మండలంలో 10 ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలను పొందిన విద్యార్థిని, విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా మెడల్స్, ప్రసంశపత్రాలు, నగదు పురస్కారాలను అందించారు. మొత్తం రూ.62,000 నగదు అందజేశారు. కార్యక్రమాలలో జెడ్పీటీసీ రామచంద్ర, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ శీనునాయక్, హెచ్‌ఎం అంజద్‌ఆలీఖాన్, ఆదర్శ పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఆణిముత్యం కావాలి

ములకలచెరువు : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి ఆణిముత్యం కావాలని ఎంఈఓ వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక జెడ్పీహైస్కూల్, మోడల్‌స్కూల్‌కి చెందిన పదోతరగతి విద్యార్థులు పలువురు జగనన్న ఆణిముత్యాలకు ఎంపికయ్యారు. వారి ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, మండల కన్వీనర్ మాధవరెడ్డి, సర్పంచు రహ్మత్‌బీ, దిన్నిపాటి రవీంద్రారెడ్డి, ఎంపీటీసీ ఆయిసా, పాఠశాల చైర్మన్ సుధాకర్, హెచ్‌యం క్రిష్టారెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

కలికిరి : ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని సర్పంచ్ బీబీ ఆయేషా అన్నారు. మండలంలోని పల్లవోలు గ్రామం గడిలో శనివారం ఉర్దూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా మంజూరైన నగదు అందజేశారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు ఇస్తియాక్ అహ్మద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్ద పీట

మదనపల్లె సిటీ : ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతి అన్నారు. శనివారం స్థానిక వడ్డిపల్లెలోని దివ్యజ్యోతి మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఉషారాణి, ప్రసాద్,భగవాన్ తదిదతరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి

కలకడ : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ శ్రీదేవి, కోన సర్పంచ్ జల్లా రాజోగపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కలకడ ఆదర్శపాఠశాల, కోన జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆనిముత్యాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ విద్యార్థులకు నగదు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కోన ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, ఎంఈఓ మునీంద్రాయక్, హెచ్‌ఎంలు మల్లంగ్‌షావల్లీ, చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే..

తంబళ్లపల్లె : ప్రతిభ విద్యార్థులకు మరింత ప్రోత్సాహం కలిగించేందుకే జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం అమలు పరుస్తున్నట్లు ఎంఈవో త్యాగరాజు తెలిపారు. శనివారం మోడల్‌స్కూల్‌లో జగనన్న ఆణిముత్యాల పంపిణీ కార్యక్రమం జరిగింది. పదోతరగతిలో ప్రతిభ చాటి మొదటిస్థానంలో నిలిచిన పల్లవికి రూ.3వేలు, ద్వితీయస్థానం మైథిలీకి రూ.2వేలు, మూడోస్థానం వేదశ్రీకి రూ.వెయ్యి నగదు అందజేశారు. అలాగే గోపిదిన్నె ఉన్నత పాఠశాలలో ప్రథమస్థానం కవితకు రూ.3వేలు, రెండొస్థానం రామ్‌చరణ్‌నాయక్ రూ.2వేలు, మూడోస్థానం ఐశ్వరకు రూ.వెయ్యి నగదు ప్రోత్సహకాలతోపాటు సర్పంచు సుధాకర్‌రెడ్డి తండ్రి మల్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రతిభ విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ.8116లు, రెండో బహుమతి రూ.4116, మూడో బహుమతి రూ.2116ల బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.